శ్రావణం.. భక్తజన పరవశం


అగళి: అలంకరణలో శనేశ్వరుడు


రొళ్ల శనేశ్వరాలయం చుట్టూ జ్యోతులతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని ఆలయాల్లో శ్రావణ సందడి నెలకొంది. దేవాలయాల్లో తొలి శ్రావణ శనివారం సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మడకశిర మండలంలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి, నీలకంఠేశ్వరస్వామి సముదాయ ఆలయాలకు భక్తులకు పోటెత్తారు. ఉత్సవ మూర్తులను ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు ప్రసాదం అందజేశారు. అమరాపురం, బసవనపల్లిలోని శనీశ్వరస్వామికి, తమ్మడేపల్లి, గౌడనకుంట, అమరాపురం చెరువులో ఆంజనేయస్వామికి అభిషేకాలు చేపట్టారు. రొళ్ల మండల కేంద్రంలో వేకువజామునే శనేశ్వరుని మూల విగ్రహానికి సుప్రభాత సేవలు, నవగ్రహారాధన, కుంకుమార్చన, అభిషేకం, అంకురార్పణ తదితర పూజలు చేశారు. వన్నారనపల్లి చెందిన మహిళలు బియ్యం పిండితో చేసి జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి సమర్పించారు. – సాక్షినెట్‌వర్క్‌:


మడకశిర: పూజలందుకున్న మిట్టబండ ఆంజనేయస్వామి


మడకశిరరూరల్‌: అలంకరణలో భక్తరహళ్లి లక్ష్మీనరసింహుడు


పూల హారాలు విక్రయిస్తున్న దృశ్యం


భక్తరహళ్లిలో లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు


అగళి: శనేశ్వరుడికి హారతులు తీసుకొస్తున్న దృశ్యం

క్లుప్తంగా

కార్పొరేట్‌ పాఠశాలలకు దీటుగా బోధించాలి


హిరేతుర్పి పాఠశాలలో వర్క్‌బుక్‌లను పరిశీలిస్తున్న ఎంఈఓ గంగప్ప

గుడిబండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు కార్పొరేట్‌ పాఠశాలలకు దీటుగా విద్యా బోధన చేయాలని ఎంఈఓ గంగప్ప సూచించారు. శనివారం మండల పరిధిలోని హిరేతుర్పి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అలాగే విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

చేతిరాతపై దృష్టి సారించాలి


చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్‌ మురళీధర్‌బాబు, పీసీ చైర్మన్‌ లావణ్య

పరిగి: విద్యార్థుల చేతిరాతపై దృష్టి సారించాలని ప్రిన్సిపాల్‌ ఎన్వీ మురళీధర్‌బాబు తెలిపారు. ఏపీఆర్‌ఎస్‌ ఎక్సలెన్స్‌ పాఠశాలలో శనివారం ప్రిన్సిపాల్‌ అధ్యక్షతన కాలిగ్రఫీ టీచర్‌ చంద్రశేఖర్‌ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈసందర్భంగా పిన్సిపాల్‌ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి అక్షరాలను అందంగా రాయడం అలవాటు చేసుకోవాలన్నారు. దీని వల్ల భాషతోపాటు సబ్జెక్టులలో ప్రతిభ మెరుగవుతుందన్నారు. చంద్రశేఖర్‌ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్కూల్‌ పేరెంట్స్‌ కమిటీ చైర్మన్‌ ఎం లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి చేయూత

మడకశిరరూరల్‌: మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామంలోని వెంకటేశ్వర వృద్ధాశ్రమ అభివృద్ధికి చేయూతనందిస్తామని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తల్లి వెంకటశివమ్మ వర్ధంతి సందర్భంగా శనివారం మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి వృద్ధులకు అన్నదానం చేశారు. స్వీట్లు అందించారు. అనంతరం నిర్వాహకుడు తిమ్మారెడ్డికి రూ.10 వేల నగదు అందజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అగళి: మండల పరిధిలోని ఆలుడి చెక్‌ పోస్ట్‌ వద్ద మధూడికి చెందిన మీసాల గోవిందప్ప కర్ణాటక మద్యం తరలిస్తుండగా శుక్రవారం అర్ధరాత్రి పట్టుకున్నట్లు ఎస్‌ఐ లావాణ్య తెలిపారు. నిందితుడి నుంచి 50 రాజా విస్కీ ప్యాకెట్లు, బైక్‌ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

బాల్య వివాహాలు అరికట్టండి


మాట్లాడుతున్న సీడీపీఓ రెడ్డిరమణమ్మ

హిందూపురం టౌన్‌: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఐసీడీఎస్‌ సీడీపీఓ రెడ్డి రమణమ్మ సూచించారు. శనివారం స్థానిక మోడల్‌ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల ఆడపిల్లలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారన్నారు. ఆడ పిల్లలు 18 ఏళ్లు, మగ పిల్లలు 21 ఏళ్ల తర్వాత వివాహాలు చేసుకోవాలన్నారు. బాల్యవివాహాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, లేదా 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లలితమ్మ, అనిత, ఏఎస్‌ఎం త్రివేణి, ఎర్రమ్మ, మహిళా పోలీస్‌ ప్రభావతి, గౌతమి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ సీజ్‌

మడకశిర: పట్టణంలోని వడ్రపాళ్యం సమీపంలో శనివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌ చేసినట్లు ఎస్‌ఐ లోకేశ్‌ తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

మడకశిర: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నియోజకవర్గంలోని ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఘనంగా జరుపుకున్నారు. న్యాయవాది లోకేశ్‌, ఏఎస్‌ఐ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఫొటోగ్రాఫర్స్‌, వీడియో గ్రాఫర్స్‌ అసోసియేషన్‌ గౌరవాధ్యక్షులు ప్రసాద్‌, బాబు, అధ్యక్షుడు జగదీష్‌, ఉపాధ్యక్షుడు మంజునాథ్‌, కార్యదర్శి గురు, కోశాధికారి దాసప్ప, సంయుక్త కార్యదర్శి కాణిమప్ప తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం రామదండు

లేపాక్షి: మండలంలోని సి.వెంకటాపురం గ్రామస్తులు రామదండు కార్యక్రమం నిర్వహించారు. వర్షాలు పడని సమయంలో రామదండు కార్యక్రమను నిర్వహించడం గ్రామీణప్రాంతాల్లో ఆనవాయితీ.

భలే హెలికాప్టర్‌


సిద్దగిరి సమీపంలో తక్కువ ఎత్తులో వెళ్తున్న హెలికాప్టర్‌

మడకశిరరూరల్‌: మండల పరిధిలోని సిద్దగిరి గ్రామం మీదగా పంట పొలాల్లో తక్కువ ఎత్తులో శనివారం హెలికాప్టర్‌ వెళ్లింది. ఎందుకు ఇంత తక్కువ ఎత్తులో హెలికాప్టర్‌ వెళ్లిందో తెలియలేదు. గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఎంతో ఆసక్తితో తిలకించారు.

వెనుకబడిన కులాల అభ్యున్నతికి సీఎం కృషి


ఎస్సీ మహిళా రైతుకు రాయితీ విత్తనాల కిట్‌ అందజేస్తున్న అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్‌

చిలమత్తూరు: వెనుకబడిన కులాల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్‌ ఆవుటాల రమణారెడ్డి అన్నారు.. మండల కేంద్రంలో రైతుభరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు 100 శాతం రాయితీతో వివిధ రకాల విత్తనాల కిట్‌లను శనివారం పంపిణీ చేశారు..జిల్లావ్యాప్తంగా 1772 మంది ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ కులాల వారికి ఎస్సీ కార్పొరేషన్‌ ద్వారా రూ.1.77 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసి కిట్లు పంపిణీకి శ్రీకారం చుట్టారు.. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆవుటాల మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాని అధిక ప్రాధాన్యత ఇస్తూ ఆర్బీకేలను ఏర్పాటు చేశారన్నారు. సబ్సిడీ ద్వారా విత్తనాలు, సూక్ష్మ సేద్య పరికరాలు, డ్రోన్‌లు, వాహనాలు , ఎరువులు ఇలా రైతాంగానికి ఎంతో మేలు చేకూరుస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అని తెలిపారు. ప్రభుత్వం వెనుకబడిన కులాలకు మంచి చేస్తోందని ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ సారయ్య , ఎంపీడీఓ నరేష్‌ కృష్ణ అన్నారు..కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్‌ ఏఈఓ సాల్మన్‌రాజ్‌, వ్యవసాయాధికారి వంశీకృష్ణ, అగ్రి అడ్వైజరీ బోర్డు మండల అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, ఏఈఓలు, జెడ్పీఎన్‌ఎఫ్‌ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు..

శభాష్‌.. ఎస్‌ఐ లావణ్య

- ప్రాణాపాయ స్థితిలో ఉన్న మూర్ఛ వ్యాధి గ్రస్తుడి ప్రాణాలు కాపాడిన ఎస్‌ఐ


హనుమంతరాయప్పను పోలీస్‌ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్‌లో) హనుమంతరాయప్ప

అగళి: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో శనివారం ఉదయం మూర్ఛ వ్యాధితో రోడ్డుపై ప్రాణపాయ స్థితిలో పడి ఉన్న ఓ వ్యక్తిని ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. ఎస్‌ఐ లావణ్య. వివరాలు ఇలా ఉన్నాయి. రొళ్ల మండలం మల్లసముద్రం గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప వ్యక్తిగత పనిమీద శుక్రవారం రాత్రి అగళికి వచ్చాడు. పని ముగించుకుని బస్టాండ్‌ వద్దకు రావడంతో అప్పటికే బస్సు వెళ్లిపోయింది. శనివారం ఉదయం బస్టాండ్‌లో ఉండగా.. అతడికి మూర్ఛ వచ్చింది. దీంతో అతడు కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ లావణ్య వెంటనే స్పందించి పోలీస్‌ వాహనంలో అతడిని పీహెచ్‌సీకి తరలించారు. వైద్యం చేయించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వ్యక్తి ప్రాణాలు కాపాడటంతో స్థానికులు ఎస్‌ఐని అభినందించారు. హనుమంతరాయప్పకు తల్లిదండ్రులు లేరు. తరచుగా అతడికి మూర్ఛ వ్యాధి వచ్చేదని కుంటుంబీకులు తెలిపారు. కాగా.. హనుమంతరాయప్పకు ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండండి


నల్లరాళ్లపల్లిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: సీజనల్‌ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి రామకృష్ణ సూచించారు. శనివారం ఆయన మండలంలోని నల్లరాళ్లపల్లిలో శుక్రవారం డెంగీ లక్షణాలతో అమర్నాథ్‌ అనే యువకుడు మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని.. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.. ఐదుగురికి డెంగీ కిట్‌ ద్వారా పరీక్ష నిర్వహించగా అందరికీ నెగటివ్‌ వచ్చింది. గ్రామంలో ఇంటింటికీ తిరిగి అపరిశుభ్రత ప్రాంతాల్లో బ్లీచింగ్‌ చల్లించారు. గ్రామాల్లో దోమల తీవ్రత ఎక్కువ ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తి నివారించవచ్చన్నారు.

ఓటరు సర్వే పూర్తి చేయండి

పెనుకొండ: ఇంటింటికీ ఓటరు సర్వేను ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు వెంటనే పూర్తి చేయాలని సబ్‌ కలెక్టర్‌ కార్తీక్‌ పేర్కొన్నారు. పట్టణంలోని స్పందన సమావేశపు భవనంలో శనివారం సాయంత్రం బీఎల్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకు మరో 2 రోజులు మాత్రమే గడువు ఉందన్నారు. ఇప్పటికి 89.09 శాతం పూర్తయిందని, మిగిలిన సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఫారం 6, ఫారం 7, ఫారం 8 ను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో జాగ్రత్త వహించాలన్నారు. అధికారులు గణేష్‌కుమార్‌, షాషావలి తదితరులు పాల్గొన్నారు.

చలివెందులలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు విజయం


గెలుపొందిన వైఎస్సార్‌సీపీ మద్దుతు అభ్యర్థి ఉపేంద్ర కుమార్‌ రెడ్డికి ప్రజల అభినందనలు


కంబాలప్పను అభినందిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

హిందూపురం: మండలంలోని చలివెందుల పంచాయతీ సర్పంచ్‌ ఉపఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు ఉపేంద్రకుమార్‌ రెడ్డి 336 ఓట్లతో ఘనవిజయం సాధించారు. హిందూపురం నియోజకవర్గంలో ఒక సర్పంచ్‌, రెండు వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగగా చిలమత్తూరు పంచాయతీలో మరుసలపల్లి 4వార్డు లక్ష్మీదేవమ్మ ఏకగ్రీవం కాగా లేపాక్షి మండలంలో పులమతి పంచాయతీలో టీడీపీ అభ్యర్థి గెలుపొందాడు. కాగా హిందూపురం మండలంలో ప్రతిష్టాత్మకంగా జరిగిన చలివేందుల పంచాయతీ సర్పంచ్‌ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు ఉపేంద్ర కుమార్‌ రెడ్డి గెలుపొందాడు. చలివేందుల పంచాయతీలో మొత్తం 2514ఓటర్లు ఉండగా అతడికి1185 ఓట్లు పోలయ్యాయి. ప్రత్యర్థి టీడీపీ మద్దుతుదారుడు రవీంద్రరెడ్డికి 848 ఓట్లు వచ్చాయి. నోటా 19, చెల్లని ఓట్లు 25 ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు వేణురెడ్డి, బాబురెడ్డి, మధుమతిరెడ్డి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పరిస్థితి పరిశీలించారు.కాగా డీఎస్పీ కంజాక్షన్‌ ఆధ్వర్యంలో సీఐలు మారెన్న, శ్రీనివాసులు, వేణుగోపాల్‌, ఎస్‌ఐలు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రొద్దం: మండల కేంద్రంలోని 3వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికలు శనివారం పోలీస్‌ బందోబస్త్‌ నడుమ ప్రశాంతగా ముగిశాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ ఎన్నికలు నిర్వహించారు. 508 మంది ఓటర్లు ఉన్నారు. 416 ఓట్లు పోల్‌ అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. 81 శాతం పోలింగ్‌ నమోదు అయింది. అనంతరం కౌంటింగ్‌ ప్రక్రియ ప్రారంభించారు. ఈశ్వర్‌కు 233 ఓట్లు రాగా, అశ్వర్థమ్మకు 172 ఓట్లు వచ్చాయి.గెలుపొందిన అభ్యర్థికి అధికారులు రాబర్ట్‌విల్సన్‌, అనంతచారి, కేశవరెడ్డి డిక్లరేషన్‌ అందజేశారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు గెలుపు

సోమందేపల్లి: బ్రహ్మసముద్రం 2వ వార్డు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు దారుడు కంబాలప్ప గెలుపొందారు. కంబాలప్పకు 80 ఓట్లు రాగా టీడీపీ మద్దతుదారుడు హనుమంతుకు 59 ఓటు వచ్చాయి. దీంతో 21 ఓట్ల మెజారిటీతో ఆయన గెలుపొందినట్లు ఆర్‌ఓ నాగరాజురావు తెలిపారు. వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్‌ వెంకటరత్నం కంబాలప్పను అభినందించారు.

కంబాలప్పకు ఎమ్మెల్యే అభినందనలు

పెనుకొండ: సోమందేపల్లి మండలం బ్రహ్మసముద్రం 2వ వార్డు ఎన్నికల్లో గెలుపొందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కంబాలప్పను ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అభినందించారు. కౌంటింగ్‌ అనంతరం ఎన్నికల అధికారి నుంచి డిక్లరేషన్‌ ఫారం తీసుకున్న కంబాలప్ప, పలువురు నాయకులు పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకుని ఎమ్మెల్యేకు కృతజతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంబాలప్పను అభినందించారు. నాయకులు నారాయణ, ఆదెప్ప, హుస్సేన్‌ తదితరులు పాల్గొన్నారు.

18 వార్డు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు విజయం

గోరంట్ల: గోరంట్ల మేజర్‌ పంచాయతీ 18 వార్డు ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు యర్రమ్మగారి నరసింహప్ప విజయం సాధించారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్‌, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎమ్మార్సీ భవన్‌లో కౌంటింగ్‌ ప్రక్రియ చేపట్టారు. 18 వార్డులో 996 ఓట్లు ఉండగా 763 ఓట్లు పోలయ్యాయి. యర్రమ్మగారి నరసింహప్ప 381 ఓట్లు టీడీపీ మద్దుతు బరిలో నిలిచిన గొల్ల నరసింహప్ప 221 ఓట్లు సాధించారు. 160 ఓట్ల మెజార్టీతో యర్రమ్మగారి నరసింహప్ప విజయం సాధించారు. మరో టీడీపీ మద్దతుదారు శ్రీకాంత్‌ 110 ఓట్లు, జనసేన పార్టీ మద్దతుదారు గోవిదంమ్మ 27 ఓట్లు సాధించారు. నరసింహప్ప కు ఎన్నికల అధికారులు డిక్లరేషన్‌ ఫారంను అందజేశారు. సాయంత్రం వైఎస్సార్‌సీపీ శ్రేణులు పట్టణంలో విజయోత్సవాలు జరుపుకొన్నారు.

వార్డు స్థానాలకు ముగిసిన ఉప ఎన్నికలు

అమరాపురం: మండల పరిధిలోని నిద్రగట్ట పంచాయతీ 4వ వార్డు స్థానానికి శనివారం ఉప ఎన్నిక జరిగింది. కెంచమ్మ విజయం సాధించినట్లు రిటర్నింగ్‌ అధికారి భాస్కర్‌ తెలిపారు. అనంతరం ఆమెకు డిక్లరేషన్‌ అందించారు.

అగళి: మండల కేంద్రంలోని 2వ వార్డు స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో నరసింహమూర్తి విజయం సాధించినట్లు రిటర్నింగ్‌ అధికారి పద్మావతి తెలిపారు.

గుడిబండ: మండల పరిధిలోని గుణేమోరుబాగల్‌ పంచాయతీ 10వ వార్డు స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో నరసింహమూర్తి విజయం సాధించారు.

విద్యార్థినికి అభినందనలు

హిందూపురం టౌన్‌: ఇటీవల విడుదలైన గ్రూప్‌-1 ఫలితాల్లో 8వ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన పట్టణంలోని ఎస్‌ఎస్‌పీఆర్‌ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థిని స్వాతిని ప్రిన్సిపాల్‌ ప్రగతి అభినందించారు. శనివారం ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ డిప్యూటీ కలెక్టర్‌ కొలువు సాధించిన స్వాతి 2010-13 మధ్య మహిళా డిగ్రీ కళాశాలలో బీజెడ్‌సీ గ్రూపుతో బీఎస్సీ పూర్తి చేసిందన్నారు. త్వరలో కళాశాలకు ఆహ్వానించి అభినందన సభ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే అప్పటి ప్రిన్సిపాల్‌ అబ్దుల్‌ ఖాదర్‌ కళాశాల పూర్వ విద్యార్థిని స్వాతిని అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్‌: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పెనుకొండ మండలం మక్కాజిపల్లి రైల్వే స్టేషన్‌ సమీపంలో శనివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీ నాయక్‌ అక్కడకు వెళ్లి మృతుడికి దాదాపు 65 సంవత్సరాల వయసుంటుందని అంచనా వేశారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

మానవత్వం పరిమళించిన వేళ


స్వర్ణలతను ఆశ్రమానికి తీసుకెళ్తున్న దృశ్యం

పావగడ: మానసిక వ్యాధితో పావగడకు చేరుకుని దిక్కుతోచని స్థితిలో ఉన్న తెలంగాణ వాసి స్వర్ణలతను ఎట్టకేలకు అనంతపురంలోని కృష్ణారెడ్డి ఆశ్రమానికి శనివారం తరలించారు. 17 రోజులుగా పావగడ పట్టణంలో తిరుగుతున్న స్వర్ణలతను గమనించిన స్థానికులు ఈ విషయాన్ని తహసీల్దార్‌ వరదరాజు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన తహసీల్దార్‌ వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అనంతరం స్థానిక హెల్ప్‌ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్‌ సహకారంతో అంబులెన్స్‌లో ఆమెను అనంతపురంలోని కృష్ణారెడ్డి ఆశ్రమానికి తరలించారు. కార్యక్రమంలో వీధి వ్యాపారుల మహిళా విభాగం అధ్యక్షురాలు శశికళ, ప్రభుత్వ ఆస్పత్రి ఆరోగ్య సిబ్బంది కృష్ణప్ప, రాము, వెంకటేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్‌: సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం చంద్రగిరి, గొల్లపల్లి, వెంకటగిరిపాళ్యం పాఠశాలల్లోని విద్యార్థులకు వైద్యులు దంత పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 130 మంది విద్యార్థులకు దంత సమస్యలు ఉన్నట్లు డాక్టర్‌ గుణశేఖర్‌ నిర్ధారించారు. ఆదివారం వెంకటగిరిపాళ్యం పాఠశాలలో మెడికల్‌ క్యాంపు నిర్వహించనున్నట్లు డాక్టర్‌ తెలిపారు.

రేపటి నుంచి 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రొళ్ల: మండల పరిధిలోని హొట్టేబెట్ట సచివాలయం పరిధిలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకూ ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్‌ శనివారం తెలిపారు. 21న హొట్టేబెట్ట, కల్లురొప్పం, కె.గొల్లహట్టి, 22న కొత్తపాళ్యం, కొత్తపాళ్యంతండా, 23న కొడగార్లగుట్ట, కొడగార్లగుట్ట కాలనీలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

మళ్లీ వెలసిన పూరి గుడిసెలు

పెనుకొండ: స్థానిక మడకశిర రోడ్డులోని 668 సర్వేనెంబర్‌లో శనివారం మళ్లీ పూరి గుడిశెలు వెలిశాయి. ఇప్పటికే రెండుసార్లు సీపీఎం ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పలువురు గుడిశెలు వేయగా రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు పోలీసులు వాటిని తొలగించారు.

యువకుడి దుర్మరణం


మృతుడు కరియన్న

గుడిబండ: ద్విచక్ర వాహనం అదుపుతప్పి గోడను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం ఆచారిపాళ్యం గ్రామానికి చెందిన నరసింహప్ప, లక్కమ్మ దంపతుల కుమారుడు కరియన్న (30), మరో ఇద్దరితో కలసి శనివారం ఉదయం గుడిబండ నుంచి మడకశిరకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో భూతప్ప కనుమ వద్దకు చేరుకోగానే వాహన వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో అదుపు తప్పి కమ్యూనిటీ భవనం గోడను ఢీకొన్నారు. ఘటనలో కరియప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రుడు శివకుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ మునిప్రతాప్‌ తెలిపారు.